

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

2

**త్రివిక్రం** తన తల్లి జనని కర్మని అయిదో రోజు ఆరంభించి, శాస్త్ర ప్రకారం దాన్ని పన్నెండో రోజు ముగించాడు. వచ్చిన చుట్టాలు కొందరు మధ్యలో వెళ్ళి మళ్ళీ పదో రోజుకి తిరిగి వచ్చారు. పన్నెండో రోజు ఉదయం భోజనాలయ్యాక మధ్యాహ్నం మూడు నుంచి జనని సంస్మరణ కార్యక్రమం సాగింది. చాలామంది జనని గురించి తమకి తెలిసింది చెప్పారు. జనని చెల్లెలు జానకి చెప్పింది.

"మా అక్కది చాలా దయగల మనసు. ఎవరైనా బాధల్లో ఉంటే తనకి తోచిన సహాయం చేసేది. బీదవాళ్ళకి చెందిన వార్తలని చదివి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి సహాయం చేసేది. ఓసారి ఈనాడులో వచ్చిన యంసెట్‌లో ఆరవ రేంక్ సంపాదించుకున్న ఓ అమ్మాయికి యం.బి.బి.ఎస్‌లో సీట్ వచ్చినా డబ్బు కట్టి చదవలేని పరిస్థితిలో ఉందని చదివి, ఆమెకి అయిదువేలు సహాయం చేసింది. ఇంకోసారి కిడ్నీలు రెండూ పాడై ఆపరేషన్‌కి డబ్బు లేదని చదివిన ఒకరికి పదివేలు పంపింది. పాత బట్టలని స్టీల్ సామాను వారికి వేయకుండా బీదవాళ్ళకి ఇచ్చేది. మా బంధువుల్లో ఒకరిద్దర్ని తన ఇంట్లో ఉంచుకుని చదివించింది. వాళ్ళల్లో రామంగాడు ఛార్టెర్డ్ అకౌంటెంట్ అయ్యాడు. శీను ప్రొఫెసర్ అయ్యాడు. ఏ లోకాల్లో ఉన్నా ఆమె ఆత్మకి శాంతి కలగాలని హనుమంతుడ్ని ప్రార్థిస్తున్నాను. అక్క ఇష్టదైవం హనుమంతుడు."

తర్వాత ఇంకెవరినైనా మాట్లాడమని పురోహితుడు కోరాడు. అంతా తమలో తాము మాట్లాడుకుంటుంటే పురోహితుడు ఒకతని వైపు చూసి చెప్పాడు.

"మీ వదినగారి గురించి మీకు తెలిసింది చెప్పండి."

త్రివిక్రం బాబాయ్ ఆదిశంకర్ చెప్పాడు.

"జానకమ్మ చెప్పింది అక్షర సత్యం. మా వదిన జనని ఇంటికి ఎవరు వచ్చినా ఆప్యాయంగా వండి పెట్టేది. ఎవరికి ఏ ఐటమ్ ఇష్టమో మా వదినకి తెలిసినట్లుగా వాళ్ళ తల్లులకి కూడా తెలీదనే చెప్పాలి. ఇంట్లో ఒక డబ్బాలో కాశీనించి వాళ్ళ అమ్మ తెచ్చిచ్చిన అన్నపూర్ణ విగ్రహాన్ని ఉంచి రోజూ గుప్పెడు బియ్యంతో దాన్ని అభిషేకించేది. ఇంటికి బంధువులొస్తే ఆ డబ్బాలోని బియ్యాన్ని తీసి వాళ్ళకి వండేది తప్ప, తమకోసం ఎన్నడూ ఆ బియ్యాన్ని వాడేది కాదు. 'ఆ బియ్యం పరాయి వాళ్ళది. వాళ్ళని అన్నపూర్ణమ్మ పంపితే వండి పెడతాను' అనేది. మా అన్నయ్య సహకారం కూడా ఇందులో ఉంది. నిజానికి భర్త సహకారం లేకపోతే ఇలాంటివి ఇళ్ళల్లో కుదరవు. మా సోదరులు ముగ్గురిలో మా అన్నయ్య మంచివాడు, సంస్కారవంతుడు అని గట్టిగా చెప్పగలను. మా పెద్దబ్బాయి హైదరాబాద్‌లో వదిన దగ్గరే వుండి సి.ఏ పూర్తి చేసాడు. వాడి పరీక్ష టైంకి నేను ఫీజు పంపలేకపోతే ఇంట్లోని వెండి మరచెంబుని తాకట్టు పెట్టి ఫీజు కట్టిన మహా ఇల్లాలు ఆవిడ. తరువాత నేనా చెంబుని విడిపించడానికి ఏణ్ణార్థం పట్టింది. అయినా ఒక్కసారి కూడా ఆ మరచెంబు

గురించి ఆమె నాతో కానీ, మా ఆవిడతోకానీ అనలేదు. సోమూ, నువ్వు కూడా వదిన గురించి చెప్పు. నా కన్నా నువ్వే వదిన దగ్గరకి ఎక్కువగా వస్తూండేవాడివి. ఆవిడ ఆత్మకి శాంతి కలగాలని దేవుళ్ళందర్నీ ప్రార్థిస్తున్నాను."

ఆ తర్వాత త్రివిక్రం చిన్న బాబాయ్ సోమశేఖర్ లేచి మాట్లాడాడు. అతనిలోని సెన్సాఫ్ హ్యూమర్ సహజంగానే ఆ మాటల్లో దొర్లి అందర్నీ నవ్వించింది.

"నేనే మా వదిన దగ్గరకి తరచూ వెళ్ళేవాడిని. ఆవిడ మీద ప్రేమతో అనుకోకండి. నాకావిడ చేసే వంట మీద ప్రేమతో వెళ్ళేవాడిని. ములక్కాయలు, టమోటాలు కలిపి చేసే కూర నాకిష్టం. నేనెప్పుడు వెళ్ళినా ఆ కూర చేసేది. ఆవిడ చేస్తుంది కాబట్టి నేను వెళ్ళేవాడిని. నేను వచ్చాను కాబట్టి ఆవిడ చేసేది. క్యాబేజీ పచ్చడి గురించి చెప్పకపోతే నాకు పాపం చుట్టుకుంటుంది. ప్రతిసారీ 'కొబ్బరి పచ్చడా వదినా?' అని అడిగేవాడిని. ఉహూ 'క్యాబేజీ పచ్చడి' అనేది. అదేమిటో క్యాబేజీని కొబ్బరి పచ్చడి రుచి వచ్చేలా చేసేది. కొలెస్ట్రాల్ ఉన్నవారికి అది రుచికి రుచి, ఆరోగ్యానికి ఆరోగ్యం. ఏమే వింటున్నావా?" అని తన భార్యని ఉద్దేశించి చెప్పి మళ్ళీ తన ప్రసంగాన్ని కొనసాగించాడు.

"నేనెప్పుడు మాట్లాడినా మా ఆవిడ వినదు. ఇప్పుడు వింటోందని కూడా నాకు నమ్మకం లేదు. మీరింతమంది నవ్వారంటే నా మాటలు వింటున్నారని నాకు ఆనందం. మరి మా ఆవిడ నవ్విందేమో చూడండి. ములక్కాయ, టమోటా కలిపి చేసిన కూర మా ఆవిడ చేసినదానికన్నా, మా వదిన చేసిందే ఎక్కువసార్లు తిన్నాను. అలాగే తెలగపిండి కూర గురించి చెప్పకపోయినా నాకు పాపం వస్తుంది. అంత అద్భుతంగా చేసేది మా వదిన. మా ఆవిడ చేస్తే అదేమిటో దానికి మీసాలు వచ్చేవి. ఆవకాయక్కూడా మా ఇంట్లో మీసాలు వస్తాయి. దాన్ని వైద్య పరిభాషలో బూజు లేదా ఫంగస్ అంటారు. నాకు డయాబెటిస్. రోజూ ఒక బెండకాయని రెండు ముక్కలు చేసి నీళ్ళల్లో నానబెట్టి, ఉదయం ఆ నీళ్ళు తాగితే షుగర్ తగ్గుతుందని రీడర్స్ డైజెస్ట్ వాళ్ళ ఇ మేగ్‌లో చదివాను. చాలాకాలంగా అలా తాగుతున్నాను. మా పెద్దన్నయ్య ఇంటికి వచ్చినప్పుడల్లా మా వదిన గుర్తుంచుకుని బెండకాయలు తెప్పించి రాత్రికి నానబెట్టి పగలు 'సోమూ. తాగు' అని ఇచ్చేది. జనని అంటే అమ్మ. పేరుకి తగ్గట్టే భూదేవికి ఉన్నంత ఓర్పు, సహనం మా వదినకి ఉన్నాయి. మా అన్నయ్య కోపం న్యూస్ పేపర్‌ని ప్రతిపక్షాల వాళ్ళు తగలపెట్టినంతసేపే ఉంటుంది. తాటాకు మంట కోపం అన్నమాట. అది చాలు మా ఆవిడలాంటి వాళ్ళు పోట్లాట పెట్టుకోవడానికి. కానీ మా వదిన ఎప్పుడూ మా పెద్దన్నయ్య మీద అలగడం నేను చూడలేదు. వాడు బడ బడా తిట్టి ఆ తర్వాత ఏం జరగనట్టు మాములుగా ఉండేవాడు. మనలో కొందరు రోజుల తరబడి తమ లైఫ్ పార్టనర్ తప్పులని మనసులో ఉంచుకుంటారు. అసలు మా ఆవిడ మనసులో ఉన్నవన్నీ అవే అని నాకు అనుమానం. అలాంటి మా జనని వదినని మృత్యువు పొట్టన పెట్టుకోవడం వల్ల మా త్రివిక్రంగాడు వాడి తల్లిని, నేను ములక్కాయ కూరని, మీసాలు రాని క్యాబేజీ పచ్చడిని కోల్పోయాను. నాకు అవి మళ్ళీ ఎక్కడైనా దొరుకుతాయేమో కానీ వాడికి తల్లి మళ్ళీ దొరకదు. జై హింద్."

ఆ తర్వాత మాయాదేవి మాట్లాడింది. ఆవిడ లేచి చెప్పింది.

"నేను ఇక్కడ అందరికీ తెలీదు. నా పేరు మాయాదేవి. మా వారు జడ్జిగా పనిచేస్తున్నారు. నేను, జనని చిన్నప్పటి నించి బెస్ట్ ఫ్రెండ్స్. ఆరో క్లాసు నించి కాలేజీ దాకా ఇద్దరం కలిసి చదివాం. పెళ్ళిళ్ళయ్యాక కొంతకాలం ఉత్తరాలు రాసుకున్నాం. తర్వాత దాని పెళ్ళికి నేను వెళ్ళాను. పెళ్ళిలో వడ్డన, ఇతర సహాయాలు చేసాను. నా పెళ్ళిలో అది వడ్డన, ఇతర సహాయాలు చేసింది. నాకు కష్టం వస్తే మొదటగా చెప్పేది దానికే. దానికి కష్టం వస్తే" ఆవిడ కంఠం దుఃఖంతో పూడుకుపోయింది. ఓ నిమిషం దాకా ఏడుస్తూండిపోయింది. తర్వాత సర్దుకుని చెప్పింది.

"దానికి వచ్చిన పెద్ద కష్టాన్ని నాతో చెప్పుకోకుండానే పోయింది. ఉత్తరాల కాలం పోయి ఫోన్స్ కాలం వచ్చాక రోజూ ఒక్కసారైనా పలకరించుకుంటూనే ఉన్నాం. ఓ రోజు ఫోన్ చేసి 'అర్జెంటుగా జెమినీ ఛానెల్ చూడు' అంది. ఏమిటా అని టి.వి ఆన్ చేసి చూసాను.

మొగుడూ పెళ్ళాల మధ్య ప్రోగ్రాం. సినిమా పాటలకి డాన్స్ చేస్తున్నారు మొగుడూ పెళ్ళాలు. 'నువ్వు, మీ ఆయనా దానికి వెళ్ళండి' అంటూ నవ్వింది. నాకు అలాంటి ప్రోగ్రామ్స్ చూడటమే చిరాకని దానికి తెలుసు. ఏడిపించడానికి సరదాగా చెప్పిందలా. పిల్లల్ని పెంచడంలో దానికి ఖచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. 'పిల్లాడినైనా మారుస్తా కాని నా అభిప్రాయాలను మార్చుకోను' అన్నది. అందుకే త్రివిక్రం యం.బి.బి.ఎస్ చేయగలిగాడు. అతను డాక్టర్ అవడానికి వెనక జనని కృషి ఎంత ఉందో అతనికీ తెలుసు. అవునా?" త్రివిక్రం వంక చూస్తూ అడిగింది.

"అవును." త్రివిక్రం ఒప్పుకున్నడు.

"వచ్చే ఏడాది మేం ఇద్దరం సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్‌లు వెళ్ళాలని ప్లాన్ చేసుకున్నాం. 'అది కొనద్దు, ఇది కొనద్దు అనే మొగుళ్ళు ఎవరూ మనతో వద్దే. ఎంచక్కా మనిద్దరమే వెళదాం' అని చెప్పింది అదే దాని ఆఖరి ఫోన్ కాల్. ఆ తర్వాత ఈ దుర్వార్త వినాల్సి వచ్చింది. 'మావారేమైనా మాట్లాడతారేమో?' అని తన భర్త వంక చూసింది. ఆయన మాట్లాడనన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు.

"అంతా మాట్లాడొచ్చు. మాట్లాడండి" చెప్పాడు బ్రాహ్మడు.

"మా ఆవిడ అన్నీ చెప్పేసింది. కాకపోతే ఒకటి చెప్తాను. ఇందాక ఆదిశంకర్ చెప్పిన తెలగపిండి కూర చేయడం జననికి మా ఆవిడే నేర్పింది" చెప్పాడాయన.

అంతా నవ్వారు. జనని పినమామ అల్లుడు ఓ ఔత్సాహిక కవి. జనని మీద రాసి తెచ్చిన కవిత్వాన్ని చదివాడు.

"నిజానికి ఇవి ప్రింట్ చేసి అందరికీ తలో కాపీ ఇద్దామనుకున్నను. కానీ ప్రెస్‌వాడు ఎల్లుండికి కానీ ఇవ్వలేనన్నాడు."

వీళ్ళు మాట్లాడేదంతా నిర్వికారంగా వింటూండి పోయాడు రాంప్రసాద్. మధ్య మధ్యలో ఆయన పక్కవారి వంక చూసి 'ఏమిటట?' అని అడగసాగాడు. చివరగా త్రివిక్రం మాట్లాడాడు.

"మా అమ్మ 'ఇది చెయ్యిరా' అంటే నేను చెయ్యనిది ఇంతదాకా ఏదీ లేదు. అలా చేయబట్టే నేను డాక్టర్ని అవగలిగాను. 'నిద్రొస్తోందమ్మ' అంటే 'ఇంకో పది నిముషాలు చదివి పడుకో. ఆ లెసన్ పూర్తవుతుంది' అనేది. తనూ నాతోపాటు మేలుకుని వారపత్రికలు చదువుకుంటూ కూర్చునేది. అమ్మ నా మీద ఇంత శ్రద్ధ చూపకపోతే నేను డాక్టర్ని అయ్యేవాడిని కాదు. బహుశా ఏ వెటర్నరీ డాక్టర్‌నో అయి ఉండేవాడ్ని. మా అమ్మ నన్ను తను మరణించిన రోజు ఆఖరిగా అడిగింది ఒక్కటే. 'పెళ్ళి చేసుకోరా' అన్నది అప్పటికప్పుడు తీర్చే కోరిక కాదు కదా అది. అదొక్కటే నేను ఆవిడ కోరికని నెరవేర్చనిది. ఆవిడ ఆత్మ ఎక్కడున్నా నన్ను చూస్తూంటుందని, నా ఉన్నతికి నన్ను ఆశీర్వదిస్తూంటుందని నాకు తెలుసు. ఆఖరుగా మీ అందరికీ ఓ విన్నపం. ఇది కొంచెం చిత్రంగా అనిపించవచ్చు కానీ విషయం అర్థం చేసుకోగల వారికి ఈ విన్నపం అర్థం అవుతుంది."

గట్టిగా ఊపిరి తీసుకుని వదిలి తను చెప్పేది కొనసాగించాడు.

"నా పుట్టుకకి సంబంధించిన ఓ ముఖ్యమైన సంఘటన జరిగింది. ఇది ఖచ్చితం. కానీ అదేమిటో నాకు తెలీదు. తెలిసిన నాన్నగారు నేనడిగినా చెప్పలేరు. ఆయన స్థితిని మీరంతా చూసారు కదా! కాబట్టి మీలో ఎవరైనా నా నించి రహస్యంగా ఉంచబడ్డ ఆ ముఖ్యమైన సంఘటనని చెప్పగలిగే వారు ఉంటే, నాకు వారు ఫోన్ చేస్తే కృతజ్ఞుడ్ని. మా నాన్నకి ఇంకో వివాహం జరిగింది అని అడిగితే లేదనే బాబాయ్‌లు చెప్పారు. నేను కోరేది తెలిసిన వాళ్ళు దయచేసి నాకు ఆ విషయం చెప్పండి. అదెంత రహస్యంగా ఉంచాల్సిందైనా సరే. నేను దేని గురించి చెప్తున్నానో అది తెలిసిన వాళ్ళు ఇక్కడే ఉన్నారని, వారికి అర్థమైందని అనుకుంటున్నాను. మా అమ్మ లేదని అనుకోకుండా పూర్వం మీరంతా మా ఇంటికి ఎప్పటిలా వచ్చి వెళ్తూండండి. మనమంతా రక్త సంబంధీకులమే. మనిషి పోవడంతో అది తెగిపోయే బంధం కాదు. నా నించి మీకు ఎలాంటి సహాయం ఎప్పుడు కావాలన్నా అడగండి."

చివరగా డెబ్బై ఆరేళ్ళ సుబ్బరామయ్య లేచి చెప్పాడు.

"జనని వాళ్ళు, మేము ముప్పై ఏళ్ళ క్రితం విద్యానగర్‌లో ఒకే కాంపౌండ్‌లో అద్దెకి ఉండేవాళ్ళం. నాయుడు కాంపౌండ్ అని అందులో పన్నెండు కుటుంబాలు ఉండేవి. ఇప్పుడు వాళ్ళల్లో చాలామంది ఏమయ్యారో నాకు తెలీదు. ఇంతకాలం గడిచినా రాంప్రసాద్‌కి, నాకు స్నేహం అలాగే కొనసాగుతుంది.

"ఇంతదాకా పెద్దలెవరూ ఈ విషయం ప్రస్తావించలేదు కాబట్టి, అది చెప్పడం విధాయకం కాబట్టి చెప్తున్నాను. తల్లి ఎటూలేదు. అతని తండ్రి పరిస్థితి మనందరికీ తెలిసిందే. తండ్రిని తన తల్లి బతికున్నప్పుడు ఎలా చూసిందో ఆయన చివరి శ్వాస దాకా అలాగే జరిపించే బాధ్యత త్రివిక్రం మీద ఉంది. అలాగే అటు తండ్రివైపు, ఇటు తల్లి వైపు బంధుమిత్రులని ఆదరించడంలో కూడా తల్లి బ్రతికి ఉన్నప్పటిలాగే అతను ప్రవర్తించాలి. తన కోసం కాకపోయినా, తన తండ్రి కోసమైనా త్రివిక్రం త్వరగా వివాహం చేసుకోవాలి. ఈ రోజుల్లో స్వంతంగా వైఫ్‌ని ఎన్నుకోవడం మామూలైపోయింది. అలాంటిదేం లేకపోతే సోమశేఖర్, ఆదిశంకర్‌లు, జానకమ్మ, ఆమె భర్త ఆ బాధ్యత తీసుకుని, పూనుకుని అతని పెళ్ళి జరిపించాలి. అమ్మ మరణించిన ఏడాది దాటాక ఆ శుభకార్యం చేయవచ్చనుకుంటాను. అది ఇక్కడున్న పండితులని అడిగి తెలుసుకోవచ్చు. అలాగే త్రివిక్రం ఇప్పుడు దాదాపు ఏకాకి. తల్లిలేదు. తండ్రి ఉన్నా లేనట్లే. కాబట్టి అతనికి బంధువులంతా అవసరమైన సలహాలని ఇస్తూ సహాయంగా ఉండాల్సిన బాధ్యత కూడా వారి మీద ఉందని ఈ సభలో నేను ప్రకటిస్తున్నాను."

ఇంకెవరూ మాట్లాడేవారు లేరని గ్రహించాక పురోహితుడు సూచించాడు.

"అందరికీ కాస్తంత టీ ఇస్తే బావుంటుంది. భారీ భోజనం వల్ల కొందరికి కునుకు వస్తున్నట్లు కనిపిస్తున్నారు."

"ఐదు నిముషాల్లో రెడీ అవుతుంది. ఆ ఏర్పాటు చేసాను" శ్యామలరావు చెప్పాడు.

సుబ్బరామయ్య మళ్ళీ లేచి చెప్పాడు.

"టీ వచ్చేలోగా ఓ ముఖ్యమైన సంగతి చెప్తాను వినండి. ఈ రోజుల్లో ప్రతీ వారికి మొబైల్ ఫోన్లు ఉన్నాయి. వాటిలో చాలా ఫోన్ నంబర్లు ఉంటాయి. ఒకోసారి వందలకొద్దీ. ఆ నంబర్లు ఎవరివో, వారు ఆ ఫోన్ యజమానికి ఏమవుతారో కుటుంబ సభ్యులకే తెలియకపోవచ్చు. మన ఏక్సిడెంట్‌కి గురైనా, పక్షవాతం లేదా హార్ట్ అటాక్ లాంటి ఆకస్మిక రోగంతో హాస్పిటల్ పాలైనా మన ఫోన్‌లోని ఏ నంబర్‌కి ఫోన్ చేసి మన గురించి చెప్పాలో మనల్ని అటెంట్ అయ్యేవారికి తెలీదు. ఏక్సిడెంట్ జరిగిన చోట బాధితుల మొబైల్ ఫోన్‌లనించి ఎవర్ని కాంటాక్ట్ చేయాలో అమెరికాలోని ఓ పేరామెడిక్‌కి తెలీలేదు. అతను ఐ.సి ఈ ఐస్ పద్ధతిని కనిపెట్టాడు. ఐస్ అంటే ఇన్ కేస్ ఆఫ్ ఎమర్జన్సీ. మనకేమైనా అయితే ఎమర్జన్సీలో ఆ విషయం చెప్పాల్సిన ముఖ్యుల ఫోన్ నంబర్లు ఐ.సి ఈ కింద స్టోర్ చేసి ఉంచుకోవాలి."

"బావుంది." చెప్పాడు శ్యామలరావు.

"ఐ.సి.ఈ 1, ఐ.సి.ఈ 2, ఐ.సి ఈ 3 ఇలా ముఖ్యుల పేర్ల ముందు నంబర్లని స్టోర్ చేస్తే అవసరానికి ఆ నంబర్లకి ఫోన్ చేసి సమాచారం అందిస్తారు. పోలీసులకి, అంబులెన్స్ స్టాఫ్‌కి ఈ పద్ధతి గురించి ఇప్పటికే తెలుసు కాబట్టి ఈ రోజే మీరు మీ మొబైల్స్‌లో ఐస్‌ని ఏడ్ చేసుకోండి. జనని సెల్‌ఫోన్‌లో ఐస్ ఉండి ఉంటే ఆ సమాచారం ఇంకాస్త ముందుగా త్రివిక్రంకి తెలిసేది."

అతను అందరి వంకా చూసి మళ్ళీ తను చెప్పేది కొనసాగించాడు.

"అంతేకాదు. డెన్మార్క్‌లో జరిగిన కొన్ని ప్రాథమిక అధ్యయనాల ద్వారా గర్భిణీ స్త్రీలు సెల్‌ఫోన్‌ని వాడకపోవడమే మంచిదని శాస్త్రజ్ఞులు చెప్తున్నారు. గర్భవతులుగా ఉండగా అతిగా సెల్‌ఫోన్ వాడిన తల్లులకి పుట్టిన పిల్లల్లో ఉద్వేగాలు ఎక్కువగా ఉండి, ఏకాగ్రత కుదరక పోవడంలేదా అతి చురుకుదనం కలిగి ఉండటం గమనించారు. సెల్‌ఫోన్ ఛార్జ్ అవుతూండగా మాట్లాడకూడదు. ఒకోసారి అది

పేలే అవకాశం ఉంది. కడప జిల్లాలోని రైల్వే కోడూరులో లావణ్య అనే మహిళ దుబాయ్‌లోని తన భర్త రామచంద్ర నించి ఫోన్ రావడంతో ఛార్జింగ్‌లో ఉన్న సెల్ ఫోన్ నించి మాట్లాడుతూంటే అది పేలి ఆమె జవరి 2010లో మరణించింది అని పేపర్లో చదివాను.

"ఇంకో ముఖ్యమైన సంగతి మనం ఇక్కడ చర్చించాలి. ఇప్పుడు జనని లేదు కాబట్టి రాంప్రసాద్‌ని ఇంట్లో ఒంటరిగా వదిలి వెళ్ళడం మంచిది కాదు. గ్యాస్ స్టవ్ ఆన్ చేసి ఆ సంగతి మర్చిపోతే ప్రమాదం. లేదా బయటకి వెళ్ళిపోవచ్చు. తిరిగి వద్దామన్నా ఇక ఇల్లు గుర్తుండదు. కాబట్టి ఆయన్ని చూసుకోడానికి ఇంట్లో ఓ మనిషి అవసరం ఉంది కాబట్టి నేను కొద్ది వారాలు రోజూ ఇక్కడికి వచ్చి విక్రం హాస్పిటల్‌కి వెళ్ళి తిరిగి వచ్చేదాకా ఆయన్ని చూసుకుంటాను. రిటైరైన నాకు పనులేం ఉంటాయి? కానీ నేను రాలేని రోజు వచ్చేందుకు ఇక్కడ ఎవరికైనా అవకాశం ఉందా? చెప్పండి."

కొద్ది క్షణాల తర్వాత తిరుమలాంబ తన కూతురుతో ఏదో చెప్పాక సుభద్ర చెప్పింది.

"ఓ రోజు ముందు చెపితే నేను వస్తాను."

"మంచిది. నీ ఫోన్ నంబర్ చెప్పమ్మ. పేరు"

సుబ్బరామయ్య ఆమె పేరు, ఫోన్ నంబర్లని రాసుకుని తర్వాత చెప్పాడు.

"ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమే. శాశ్వత పరిష్కారం త్రివిక్రం పెళ్ళి చేసుకోవడమే. అప్పుడు ఆయన్ని కోడలు చూసుకుంటుంది."

రాంప్రసాద్ అక్కడికి వచ్చిన వారందరినీ 'నీ పేరేమిటి?' అని అడగసాగాడు. వాళ్ళు పేరు చెప్పిన పావుగంటకి మళ్ళీ అదే ప్రశ్న వేయసాగాడు.

ఏలక్కాయ కలిపిన టీ వచ్చింది. ఆ తర్వాత ఒక్కొక్కరు వెళ్ళిపోయారు. 'వెళ్తున్నానని' చెప్పి వెళ్ళకూడదన్న ఆచారాన్ని పాటించి ఎవరూ త్రివిక్రంతో ఆ ముక్క చెప్పకుండా వెళ్ళిపోయారు. రాత్రి దీపం చూడకూడదన్న ఆచారం కూడా ఉంది కాబట్టి వచ్చిన బంధువులంతా ఆ కార్యక్రమం అయ్యాక వెళ్ళిపోయారు. ఊళ్ళనించి వచ్చిన వారందరితో సహా అంతా వెళ్ళిపోయి చీకటి పడగానే తండ్రీ కొడుకులు ఇద్దరే ఆ ఇంట్లో మిగిలారు.

రాత్రి పదిన్నరకి ఇంటి సింహద్వారం తలుపు మూసి లోపల అడ్డ గడియ వేసి దానికి తాళం వేసాడు త్రివిక్రం. తాళం చెవిని తన గదిలో బుక్ షెల్ఫ్‌లో పుస్తకాల వెనక ఉంచాడు. ఓసారి రాత్రి తలుపు తెరుచుకుని రాంప్రసాద్ ఎటో వెళ్ళిపోయాడు. మర్నాడు ఉదయం చూస్తే లేడు. ఊరంతా ఆయన కోసం మనుషులు వెదికితే సాయంత్రం నాలుగుకి సికింద్రాబాద్ క్లాక్ టవర్ ఎదురుగా ఉన్న పార్క్‌లో మట్టి కొట్టుకుపోయిన ఒంటితో, కేవలం అండర్‌వేర్‌తో కనిపించాడు. ఎవరో అతని వంటి మీది దుస్తులని కూడా దొంగిలించారు. గోద్రేజ్ లేచ్ లాక్ మాత్రమే ఉన్న మెయిన్ డోర్‌కి లోపల అర్జెంట్‌గా అడ్డ గడియని పెట్టించింది జనని. ఆ రాత్రి నించి లోపల రెండు తాళాలు వేయడం ఆరంభించారు.

జనని తన భర్త గదిలో పడుకునేది. ఇప్పుడు తల్లి లేకపోవడంతో ఆయన్ని రాత్రిళ్ళు ఒంటరిగా వదలదలచుకోలేదు. ఏదైనా అవసరానికి తండ్రే తనని లేపుతాడన్న ఉద్దేశంతో ఆ రాత్రి నించి త్రివిక్రం తన గదిలో పడుకోవడంమాని తండ్రి గదిలోనే నేలమీద పరుపు పరుచుకుని పడుకోవడం కూడా మొదలెట్టాడు. ఆదిశంకర్ దీన్ని సూచించాడు.

రాంప్రసాద్ పదిన్నరకల్లా నిద్రపోయాడు. కానీ త్రివిక్రంకి ఓ పట్టాన నిద్రపట్టలేదు. 'తన అసలు తల్లి ఎవరు? తను ఈ కుటుంబంలోకి ఎలా వచ్చాడు?' అన్న రహస్యం తెలుసుకోవాలనే ఆలోచనలతో త్రివిక్రంకి చాలాసేపు నిద్రపట్టలేదు.

త్రివిక్రం లేచి కంప్యూటర్ ఆన్ చేసి, ఇంటర్నెట్‌లోకి వెళ్ళాడు. యాహూ ఛాటింగ్‌లో బింబ్లి ఆన్‌లైన్‌లో ఉందని గ్రహించాడు. ఆమెతో ఛాటింగ్ మొదలెట్టాడు.

"హా. ఐయాం 4 యూ." టైప్ చేసాడు.

"హా. అక్నాలెడ్జ్‌డ్ లాంగ్ టైం నో సీ?" బింబ్లి నించి జవాబు వచ్చింది.

"చిన్న ట్రాజెడీ జరిగింది" ఇంగ్లీష్‌లో టైప్ చేసాడు.

"కొంపతీసి మీకు కానీ పెళ్ళయిందా?"

"లేదు."

"మీరు బుషి బేంక్‌లో ఫిక్సెడ్ డిపాజిట్లు పెట్టారా?"

"లేదు."

"మరి ఇంక ట్రాజెడీ ఏమై ఉంటుందబ్బా?"

"మా అమ్మ మరణించింది."

"ఓ గాడ్! కిడ్డింగ్?"

"ఉహూ! నిజం. యాక్సిడెంట్‌లో పోయింది."

"ఎలా? ఎప్పుడు?"

"వన్ మినిట్. దినపత్రికలో వచ్చిన వార్త లింక్‌ని పంపుతున్నాను. చదవండి."

నోట్ పేడ్ లో పేస్ట్ చేసి ఉన్న ఆ లింక్‌ని ఆమెకి పంపాడు.

"ఒన్ సెక్."

త్రివిక్రం ఆలోచిస్తున్నాడు. గత నాలుగునెలలుగా అతను బింబ్లి అనే నిక్ నేమ్ పెట్టుకున్న వ్యక్తితో ఇంటర్నెట్‌లో ఛాట్ చేస్తున్నాడు. వచ్చిన వివరాలని బట్టి ఆమె హైదరాబాద్‌లో నివసించే తెలుగమ్మాయి. ఎం.బి.ఏ విద్యార్థిని. తెలుగు దినపత్రిక చదివితే ఆమెకి తెలుగు వచ్చో, రాదో తెలుస్తుంది అనుకున్నాడు. ఇంకో రాష్ట్రం లేదా దేశానికి చెందిన వ్యక్తి అయి, తనతో సరదాగా తెలుగమ్మాయిలా ఛాట్ చేస్తుంటే, ఆ విషయం తెలిసిపోతుంది. ఇంటర్నెట్‌లో ఛాట్‌లో పాల్గొనేవారు తమ దేశం, సెక్స్, ఉద్యోగం ఇలా ఏ విషయంలోనైనా అబద్ధం ఆడగలరు.

"ఓ గాడ్! రోడ్ క్రాస్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడటం వల్ల ఇలాంటి యాక్సిడెంట్ జరిగిందా? అలా అయితే నేను ఇప్పటికే ఎన్నో సార్లు కార్ల కింద పడి ఉండాలి."

"బి ఏ గుడ్ ఎగ్జాంపుల్ ఆర్ ఏ బేడ్ వార్నింగ్ అంటారు. మా అమ్మని ఈ విషయంలో బేడ్ వార్నింగ్‌గా తీసుకోవచ్చు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం డ్రైవ్ చేయకూడదు. రోడ్డు క్రాస్ చేయకూడదు. ఎందుకంటే అప్పుడు ఏకాగ్రత ఉండదు."

"యు ఆర్ రైట్."

అంటే ఆ వ్యక్తికి తెలుగు చదవడం వచ్చన్నమాట. తెలుగుని ఇంగ్లీష్ లిపిలో టైప్ చేస్తే తెలుగు మాట్లాడటం వచ్చిన ఏ గుజరాతి లేదా మహారాష్ట్రియన్ అమ్మాయో అయితే అర్థం చేసుకోగలదు. ఖచ్చితంగా తెలుగు వ్యక్తే తెలుగు పేపర్‌ని చదవగలరు. కాబట్టి బింబ్లి తెలుగు అమ్మాయే అయివుండాలి.

"ఐయాం రియల్లీ సారీ సిబి."

ఆమె తన అసలు పేరుని దాచి బింబ్లి అనే పేరు పెట్టుకున్నట్లుగానే త్రివిక్రం తన పేరుని దాచి యూజర్ నేమ్‌గా 1967లో సౌత్ ఆఫ్రికాలో మొదటి హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ చేసిన డాక్టర్ క్రిస్టియాన్ బర్నార్డ్ గౌరవార్థం ఆయన పేరులోని రెండు పొడి అక్షరాలని తీసుకుని

'సిబి' అనే పేరుని పెట్టుకున్నాడు."అదా కారణం ఇంతకాలం ఛాటింగ్‌లో మిస్సింగ్‌కి. నాకు చెపితే మీ ఇంటికి వచ్చి ఆవిడ్ని చూసేదాన్ని కదా?"

"ఇంటర్నెట్‌ని ఇన్ని రోజులు యాక్సెస్ చేయలేదు. ఇవాళ పన్నెండో రోజుతో కార్యక్రమాలు పూర్తయ్యాయి."

"నేను పెళ్ళి చేసుకోవాలని మా బంధువులంతా ఇవాళ తీర్మానించారు."

"వండ్రఫుల్. కంగ్రాట్స్. సంబంధం కూడా చెప్పారా?"

"ఆఁ"

"ఎవరు?"

"బింబ్లి అని.."

"బ్లష్ బ్లష్" అని టైప్ అయిన పదాలు వచ్చాయి.

"కానీ మీరు అబ్బాయో, అమ్మాయో నాకు నమ్మకం లేదుగా? అబ్బాయి అయి అమ్మాయిగా నటిస్తున్నారేమో?"

స్మయిలీని పంపించింది బింబ్లి.

"ఓసారి కలుద్దామా?" అని టైప్ చేసి కూడా దాన్ని డిలీట్ చేసేసాడు.

"ఆఫ్ ఐ గో" టైప్ చేసాడు.

"ఒ.కే మరి మీరు హాస్పిటల్‌కి వెళితే మీ నాన్నగారిని ఎవరు చూసుకుంటారు?"

"మనిషి కుదిరే దాకా సుబ్బరామయ్య, ఆయన రాలేని రోజు సుభద్ర వస్తామన్నారు."

"దట్స్ గుడ్ ఇంతకీ వీళ్ళు ఎవరు?"

"సుబ్బరామయ్య ఫేమిలీ ఫ్రెండ్ సుభద్ర మా అమ్మని ఆ దురదృష్టకరమైన రోజు బయటకి తీసుకెళ్ళిన తిరుమలాంబ కూతురు."

త్రివిక్రం సైనాఫ్ చేసేసాడు ఇంత విశాలమైన హైదరాబాద్‌లోని ఆ వ్యక్తి ఎవరై ఉండచ్చు? ఆడా? మగా? ఆడే అయితే వయసు ఎంతుండొచ్చు? ఏ ఏభయ్యవ పడిలో ఉన్న ఆవిడా? లేక టీజ్ చేయడానికి ఆడపేరు పెట్టుకున్న మగాడా?

ఓ డీవీడిని కంప్యూటర్ సీపియూలోకి ఇన్‌సర్ట్ చేసి ఓ తెలుగు సినిమాని చూడసాగాడు. కొత్త తరం దర్శకుడు తీసిన సినిమా అది. రెండు కామెడీ సీన్లు చూసాక తండ్రి అంటే భయం, గౌరవంగల త్రివిక్రంకి ఆ సినిమాలోని హాస్యాన్ని చూసి చిరాకు వేసింది.

ఏ కుటుంబాన్ని అయినా సాధారణంగా పోషించేది తండ్రి. పూర్వం సినిమాల్లో కుటుంబం అంతా గౌరవించదగ్గ వ్యక్తి తండ్రి అనే పద్ధతిలో తండ్రి పాత్రని చూపించేవారు. కానీ తండ్రి పాత్ర క్రమంగా తెలుగు తెర మీద తన అస్తిత్వాన్ని కోల్పోవడం, ఇప్పుడు తండ్రి గౌరవనీయమైన వ్యక్తి కాక ఓ జోకర్ స్థాయికి దిగిపోవడం గమనిస్తున్నాడు.

"ఏమ్మా ఈయనకి నేనెలా పుట్టాను? డాడీని అర్జెంట్‌గా మార్చేయ్" అని కొడుకంటే, తల్లి 'అదే ఆలోచిస్తున్నానురా' అని ఓ సినిమాలో అంటుంది.

'ఏం నాన్నా? పక్కింటి ఆంటీకి లైనేస్తున్నట్లున్నావు?' అని ఇంకో సినిమాలో ఓ పుత్రరత్నం అంటాడు.

'పొట్టోడా, బక్కోడా, వేస్ట్‌ఫెలో. నీకంత సీన్ లేదు, సన్నాసి నాన్నా' తండ్రితో ఇంకో సుపుత్రుడు అంటాడు.

తెరమీదకి తండ్రిగా ఎస్.వి.రంగారావు, గుమ్మడి వెంకటేశ్వరరావు వస్తే, ఆ సీన్‌లో గాంభీర్యం చోటు చేసుకునేది. కానీ ఇప్పుడు తెరమీద తండ్రుల పాత్రలని వేసే చంద్రమోహన్, తనికెళ్ళ భరణి, చలపతిరావు, ఎల్బీ శ్రీరాం, కోట శ్రీనివాసరావు, ఎమ్మెస్ నారాయణులు కనిపిస్తే కుటుంబంలో మానవ సంబంధాలు ఎంతగా దిగజారాయా అని త్రివిక్రం చాలా సినిమాలు చూసి అనుకున్నాడు.

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అనే సంస్కృతి భారత దేశంది. మొదట వినోదం పేరిట కాలేజీ లెక్చరర్లని బఫూన్లుగా చిత్రించి 'ఆచార్య దేవోభవ'ని యూత్ సినిమాలు దిగజార్చాయి. తర్వాత తండ్రులతో మందుకొట్టే కొడుకులు, బూతులు మాట్లాడే కొడుకులు తయారయ్యారు. తండ్రి అంటే ప్రేమ, గౌరవం, అభిమానం గల త్రివిక్రం తండ్రిని జోకర్‌గా, బ్రోకర్‌గా దిగజార్చిన ఆ సినిమాని ఇక చూడకుండా మధ్యలోనే ఆపేసాడు. రచయితల కలాలకి, దర్శకులకి ఆలోచనల బారిన పడకుండా ఇంకా మిగిలి ఉంది మాతృ దేవోభవ అనుకున్నాడు.

అయితే ఆ సినిమాలోని ఓ డైలాగ్ అతనికి తన సమస్య విషయంలో ఓ మార్గాన్ని స్ఫురింప చేసింది.

"నిజంగా నేను ఈ తింగరోడికే పుట్టానా?"

తన తల్లికి గర్భసంచి లేదు కాబట్టి తను తన తండ్రికి, మరెవరికో పుట్టి ఉంటాడు అని ఆ డైలాగ్ వల్ల త్రివిక్రంకి స్ఫురించింది. అతను స్వతహాగా డాక్టర్ కాబట్టి ఆ విషయాన్ని రూఢీ చేసుకోవాలని అనుకున్నాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments